# మహాపురుషుల గతి

ఒక స్నేహితుడ్ని కలుసుకోవాలని బస్సు దిగి ఒక మైలు పొలం గట్టు మీద నడిచి ఆ గ్రామం వెళ్తే యింటికి తాళం పడివుంది. కుటుంబం అంతా తిరుపతి వెళ్ళారట ముందు రోజే. తిరిగి వచ్చి రోడ్డుమీద బస్సుకోసం నిల్చున్నాను. అక్కడ చిన్న బజారు వుంది. ఒక కాఫీ హోటలుకూడా వుంది. ఇది చుట్టూవున్న గ్రామాలకు కూడలి స్థానంగా వుంది. మరో రెండు గంటలు దాటితే గానీ తిరిగిపోడానికి బస్సులేదని తెలుసుకోగానే టీ తాగుదామని కాఫీ హోటల్లో దూరాను. గడ్డికప్పుతో వున్నా హోటల్ విశాలంగా వుంది. పైన సిమెంట్ స్లాబ్ వెయ్యడానికి తగ్గ బలమైన గోడలే. ఉన్న టేబిలు బెంచీలు నీటుగానే వుంటాడు. అందుకే అక్కడ యిడ్లీ తినబుద్ధి పుట్టింది. హోటల్లో ఆ సమయంలో అట్టే రద్దీ లేకపోవటంవలన తిన్నాక అలా కూర్చున్నాను. కూర్చున్నవాడిని మధ్యనున్నదూలంకు కొట్టిన పండిట్ నెహ్రూ ఫోటో ప్రక్కనే ఒక అద్దం కట్టిన వైనంపై నా దృష్టి పడింది. అందులో ఫోటో లేదు. ఒక తెల్ల కాగితం మీద నల్లని సిరాతో దిద్ది రాసిన దళసరి అక్షరాలు కనిపించాయి.

"25-2-84 రాత్రి 2 గంటల 45 నిముషములకు శ్రీ సంత నిమ్మయ్య పరమపదించెను. అతని ఆత్మకు శాంతి లభించుగాక!''

నా యెదురుగా, కాకీ నిక్కరున్నా పైన బనియనైనా లేకుండా, నల్లని బొజ్జను చూపిస్తూ నిల్చున్న ఆ హోటల్ యజమాని - కమ్ - సెర్వర్‌ని అడిగాను.

''సంత సిమ్మయ్య మీ నాన్నగారా?''

''కాదండి!''

''నెహ్రూ ప్రక్కనే వ్రేలాడదీశావని అలాగనుకున్నాను.''

''నెహ్రూ దేశానికి మేలు చేశాడు. మహా పురుషుడు. సంత సిమ్మయ్య మా కుటుంబానికి మేలు చేశాడు - మాకు మహాపురుషుడు.''

దేశంలో ఒక మూల నున్న యీ నెహ్రూ భక్తునికి నెహ్రూ గురించి యెంత తెలుసునో తెలుసుకుందామని–

''ఎప్పుడైనా ఢిల్లీ వెళ్లారా?" అన్నాను

''లేదండి!''

''నెహ్రూ యెలా బతికాడో తెలుసా?''

''తెలీదండి!''

''ఢిల్లీ తీన్‌మూర్తి భవనంలో వుండేవాడు. కొన్ని ఎకరాల పచ్చనితోట మధ్య భవనంలో, యిల్లంతా తివాశీలు, పరుపులు, కుర్చీలు....గులాబివనం.... ఆ పక్కనే పెట్టడానికి సంత సిమ్మయ్య ఫోటోయైనా దొరకలేదా?'' అన్నాను.

''బతికున్నప్పుడు ఆడు ఫోటో దిగలేదు.''

''అంత మేలు చేసాడంటున్నావు. ఆ చచ్చిన శవం ఫొటోయైనా తియ్యలేదా?''

''ఆ రోజు శోకంలో పడి, ఆ తలపు రాలేదండి - పొరపాటే.''

''ఇంతకీ యీ సిమ్మయ్య యెవరండి?''

''ఎవరని చెపుతాను? ఎన్నాళ్ళయి చీకటిలో తిరుగుతున్నాడో మా యింటి ముందర పడిపోనాడు. మా నాయన వాడి నోటిలో గంజిపోస్తే తేరుకున్నాడు. ఎవరి బిడ్డవురా అంటే వెక్కివెక్కి యేడ్చాడు. గతిలేని వాడని వెంట తిప్పుకుని వూరూరా తిరిగి మా నాయన యాపారం చేశాడు."

"ఉల్లి, మిరపకాయ బస్తాలు వీడే మోసాడా?"

"ఇద్దరూ మోసారు."

"మోసిందానికి యేం యిచ్చాడు?"

"వాడు అడక్కుండా తిండి పెట్టాడు. కట్టుకోడానికి పంచె యిచ్చాడు."

"ఉండడానికో?''

"ఆడు పడుకోవడానికి యెంత జాగా కావాలి? ఇల్లంతావాడిదే.దొంగతనం లేనేలేదు. ఇల్లు అప్పచెప్పేసి హాయిగా నిదరోయేవాళ్ళం."

"దొంగలొస్తే జాగిలంలాగ మీదపడిపోయేవాడా?"

"ఉత్తి అమాయకుడండీ. పదిరూపాయల కాగితం చేత పెడ్తే దానివిలువ చెప్పలేనోడు."

"నిమ్మయ్యకి మరి వయసు అల్లర పెట్టలేదా?"

''బ్రహ్మచారండీ. లోకజ్ఞానం చెప్పలేకపోయినా తెలుసుకున్నవాడండీ. మేం వాడిని నమ్మాం - వాడు మమ్మల్ని నమ్మాడు."

''నమ్మకంతో వాడేం చేశాడు? మీరేం చేశారు?"

"వాడా? ఇక్కడ కాఫీకొట్టు పెట్టమని చెప్పినోడు వాడేనండి కొన్నాళ్ళు బేరాలు లేవు. సద్దికూడు వదలి, కాఫీ నీటికెవరొస్తారు? బాగులేదని యిడ్లీ సెయ్య మన్నాడు. ఒక్కడే అంత రుబ్బి అందించేవాడు. అంతంత యిడ్లీలు. నోట్లో యేస్తే కరిగిపోయేవి. తింటే యిక్కడే తినాలని వచ్చేసేవోరు.... ఈయాళ యిక్కడ యీ మాత్రం నిలదొక్కుకున్నామంటే ఆడిసలవే."

"పోనీ, పెళ్ళి చేశారు కాదు. కనీసం వాళ్ళ వాళ్ళెవరైనా ఉన్నారని తెలుసుకోడానికి ప్రయత్నించారా?''

"ఎక్కడో కోటబొమ్మాళిలో చెల్లెలుందని విన్నాను. అంతే. వీడు వెళ్ళ లేదు. వాళ్ళు రాలేదు. అంచేత ఆ యిన్నది గాలికబురే అని మరి ఆ వూసే యెత్తలేదు."

''ఏం జబ్బు వచ్చి పోయాడు?"

"చిన్నప్పుడు చర్మవ్యాధి వుండేదట అది పెద్దయ్యాక ఉబ్బస జబ్బుగా మార్చేసిందట. మందిపిస్తామంటే అదే పోతాదనేవోడు. వద్దయ్యా అంటే పని చెయ్యటం మానేవోడు కాదు ఏనాడూ అమ్మో అనలేదు కదా! అంత బాధను మూలుగైనా బయటపడకుండా భరిస్తున్నాడని పోల్చుకోలేక పోనాం. ఆరు బయట చలిలో పడుకునేవాడు. ఒక్కసారి గురకొచ్చేసింది. మాట పడిపోనాది. ఒక్క-రోజూ దాటకుండానే పరమపదించాడు."

అంతా విన్నాక లేచి నిల్చున్నాను. అటూ యిటూ క్రిందా మీదా చూసి "ఈసారి నేను వచ్చేసరికి యిది డాబా యిల్లయిపోతుంది" అన్నాను.

"ఏటండీ, మీరు సిద్ధాంతులా?" అంటూ ఆతృతగా ముందుకొచ్చాడు కాఫీ కొట్టు యజమాని.

"టిటిచెస్ చూసి చెప్తున్నాను."

"మీ నోటి చల్లదనాన... అలా జరిగితే..."

''అప్పుడు... ఆ రాసి అద్దం కట్టించాలి - అని చెరిపేస్తారా?"

"అంత పని చేస్తానా?"

''అతను చేసినపనే మరిచిపోయినవారు కదా మీరు - అతన్ని కలిమిలో పొగుడ్తూ కూర్చుంటారా?"

"నేనేటి మరచిపోనానండీ?"

"సిమ్మయ్య రుబ్బి రుబ్బి అంత పెద్ద యిడ్లీలు మెత్తటివి యిచ్చాడన్నారు. ఇప్పుడు మీరిచ్చిన యిడ్లీ చిన్నదైనా పరవాలేదు గానీ నోట్లో వేస్తే నమలకుండా మింగలేనంత గట్టిగా వున్నాయి. నా మాట అబద్ధమో - నిజమో తెలుసుకోడానికి ఒక యిడ్లీ తినిచూడండి ''

''ఆ రోజు మనుషుల్లో నీతి యీరోజు మనుషుల్లో వున్నాదండీ? అప్పటిలా ధరవరలు యిప్పుడున్నాయండీ?"

"మనిషి నాలిక యెలా తిప్పితే అలా తిరుగుతుంది కదా!"

"అంతలోనే మా కుటుంబానికి మేలుచేసిన్న సిమ్మయ్యని మరచిపోతామండీ?" ఒక చెడ్డమాట అనగలమండీ? ఎవరైనా అడిమీద అంటే వూరుకుంటామండీ?" దెబ్బలాటకు వచ్చినట్లు మీది కొచ్చాడు.

"ఆ ఫోటోను చూడండి ఒకసారి" అని నెహ్రూ ఫోటోను చూపించాను.

"నెహ్రూ దేశానికి మేలుచేసిన మహాపురుషుడు" అని చేతులు జోడించాడు.

"ఆ నెహ్రూయే యీనాడు మన అన్ని కష్టాలకు కారకుడని తిట్టున్న వాళ్ళు యెందరో వున్నారీ దేశంలో - తెలుసా? వీళ్ళలోటుపాట్లు మరచి అలాంటి వాడిని తిట్టున్నప్పుడు - ఓ సంత సిమ్మయ్యను తిట్టకుండా వూరుకుంటారా?"

ఆ ప్రశ్నవేసి అక్కడుంటే అంత మంచిది కాదని మళ్ళీ రోడ్డుమీదకు వచ్చేసి ఒక చెట్టు చాటున బస్సుకోసం నిల్చున్నాను. *

(1987)